క్లుప్తంగా

విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



గుడ్లవల్లేరు: విద్యా హక్కు చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సీసీఆర్) జిల్లా కమిటీ సభ్యులు పి.సురేష్, కె.అలెగ్జాండర్, సాయిరామ్ కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వోకు వినతిపత్రం అందించామన్నారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లతో పేదలకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు.

రేషన్ షాపులు ఏర్పాటు చేయండి

గుడివాడరూరల్: మల్లాయపాలెం పరిధిలో ఉన్న టిడ్కో కాలనీలో రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావుకు సోమవారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి కూడా తీసుకెళ్తానన్నారు.

మృతుడి కుటుంబానికి వితరణ



గుడివాడ టౌన్: అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి వితరణ అందజేసినట్లు గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ రూ. 10 వేలు వితరణ అందజేసినట్లు అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ తెలిపారు. ఈ నెల 5వ తేదీన మృతి చెందిన షరీఫ్‌బేగ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఈ వితరణ అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు టి. లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఖుర్దూస్, సభ్యులు బి.ఆంజనేయులు, కె. నాగరాజు, ఎస్‌కె మొహిద్దీన్‌బాషా, ఎం.శామ్‌కుమార్, ఆర్. వీర్రాజు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు ఇష్ట దైవం ఉప్పలమ్మ



గుడ్లవల్లేరు: ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లోని చాలామంది భక్తులకు ఉప్పలమ్మ తల్లి ఇష్ట దైవమని వేద పండితుడు కె.నరసయ్య అన్నారు. చంద్రాల శివారు సింగలూరులో శ్రీ ఉప్పలమ్మ తల్లి సంబరాల్లో భాగంగా శ్రీ యల్లమ్మ తల్లి అమ్మవారి కల్యాణానికి పుట్ట మన్ను తీసుకొచ్చే కార్యక్రమాన్ని సోమవారం నరసయ్య బృందం చేతుల మీదుగా ప్రారంభించారు. తెలంగాణా సంప్రదాయ పద్ధతిలో సంబరాలను నిర్వహించారు.

మండవల్లిలో యోగాంధ్ర



మండవల్లి: పంచాయతీ పరిధిలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ కే రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు, ఈఓపీఆర్డీ, వెలుగు సీసీ, ఆర్ఐ శ్రావణి, వీఆర్వోలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో సోమవారం డీఎస్సీ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ రాజారమేష్, అడ్మిన్ పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 180 మందికి గాను 137 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 167 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

మచిలీపట్నంటౌన్: యోగాతో మన ఆరోగ్యం కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ బాపిరాజు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని లక్ష్మీ టాకీస్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి అందరితో యోగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని రోజూ అరగంటసేపు యోగా చేయడం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఆర్ఐఓ సాల్మన్ రాజు, యోగా గురువు ఎం. శాస్త్రి, నగరపాలక సంస్థ, ఆయుష్ శాఖ డాక్టర్లు పాల్గొన్నారు.

ధాన్యం నగదు కోసం ఎదురుచూపులు!

- రైతుల ఖాతాల్లో జమకాని నగదు
- ఖరీఫ్ సాగు సన్నద్ధతపై అన్నదాతల ఆందోళన



వల్లూరుపాలెం సమీపంలో బస్తాల్లో నింపిన ధాన్యం (ఫైల్)

తోట్లవల్లూరు: ధాన్యం నగదు కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా దాళ్వాకు సంబంధించిన నగదు ఇంకా రాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యం నగదు త్వరగా వస్తే సాగు పనులకు శ్రీకారం చుట్టాలనే ఆశతో ఉన్నారు. తోట్లవల్లూరు మండలంలో ఈ ఏడాది సుమారు 1,000 ఎకరాల్లో దాళ్వా పంట సాగైంది. మండలంలోని రొయ్యూరు, వల్లూరుపాలెం, బొడ్డపాడు, చినపులిపాక గ్రామాల పరిధిలో దాళ్వా సాగును రైతులు ఎక్కువగా నిర్వహించారు. వాతావరణం అనుకూలించటంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చాయి.

ఆర్ఎస్‌కేల ద్వారా కొనుగోలు

రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. ధాన్యం నూర్పిడి చేసే సమయానికి అకాలవర్షాలు రావటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా మిల్లులకు టార్గెట్ పూర్తయిందని, తేమశాతం ఎక్కువగా ఉందంటూ ఆర్ఎస్‌కే సిబ్బంది రైతులను ముప్పుతిప్పలు పెట్టారు. గోనె సంచులు కోసం కూడా రోజుల తరబడి ఆర్ఎస్‌కేల చుట్టూ తిరగాల్సి వచ్చింది.

జాప్యంతో ఇబ్బందులు

అనేక వ్యయప్రయాసల కోర్చి పంట పండించి విక్రయిస్తే నెలలు గడుస్తున్నా డబ్బు చేతికి అందటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పొంతన లేకుండా పోతోందని అంటున్నారు. ధాన్యం డబ్బును త్వరగా విడుదల చేస్తే ఖరీఫ్ సాగు పనులకు ఉపయోగించుకుంటామని లేదంటే అప్పులు చేయక తప్పదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం డబ్బును త్వరగా విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరగా విడుదల చేయాలి



నేను బొడ్డపాడులో ఐదు ఎకరాల్లో దాళ్వా సాగు చేశాను. 150 బస్తాల దిగుబడి వచ్చింది. పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రం ద్వారా విక్రయించి రెండో నెల కావస్తోంది. ఇంత వరకు డబ్బులు రాలేదు. ప్రభుత్వం డబ్బులు త్వరగా విడుదల చేసి ఆదుకోవాలి.

– నన్నాసాహెబ్, కౌలు రైతు, బొడ్డపాడు

జమ కావాల్సి ఉంది



మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి 2,495 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్ఎస్‌కేల ద్వారా కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి రూ. 5.54 కోట్లను 258 మంది రైతులకు చెల్లించాం. ఇంకా పలువురు రైతులకు నగదు చెల్లించాల్సిన మాట వాస్తవమే.

– జి. నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, తోట్లవల్లూరు

మందులను మార్చి వినియోగించాలి



డ్రోన్ వినియోగాన్ని వివరిస్తున్న అధికారులు

కోసూరు(మొవ్వ): పంటలకు వాడే రసాయన మందుల రకాలను మార్చి పిచికారీ చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి సూచించారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని కోసూరు సచివాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. మొవ్వ ఏఓ శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రేవతి డ్రోన్‌ల ఆవశ్యకతను తెలియజేశారు. డ్రోన్ పిచికారీతో కలిగే లాభాలను వివరించారు. మొవ్వ సబ్ డివిజన్ సహా వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎస్.శ్యామల ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిత, ఉద్యాన అధికారి కీర్తి, నాయకులు పెరుమాళ్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జర్నలిజానికి సంకెళ్లు రాజ్యాంగ అపహాస్యమే

ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సద్‌రుద్దీన్ ఖురేషి



మచిలీపట్నంటౌన్: జర్నలిజానికి సంకెళ్లు రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ముస్లిం సంక్షేమ సంఘం ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సద్‌రుద్దీన్ ఖురేషి పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును ఏపీ పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాలనలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమని, ప్రజలకీ ప్రభుత్వానికి వారధిగా వారు ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై అక్రమ కేసులు పెట్టి పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం అప్రజాస్వామ్యమన్నారు. ముమ్మాటికీ ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడేనని అభివర్ణించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, పత్రికలపై దాడి ఓ రకంగా ఎమర్జెన్సీని తలపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

షైనింగ్ స్టార్ విజేతలకు అభినందనలు



కలెక్టర్ డీకే బాలాజీ నుంచి అవార్డులను అందుకున్న విద్యార్థులు

అడ్డాడ(పామర్రు): పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి, షైనింగ్ స్టార్ విజేతలుగా తమ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారని అరవింద హైస్కూల్ హెచ్ఎం ఎస్.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం అడ్డాడలోని అరవింద హైస్కూల్లో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలోని జెడ్పీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో తమ హైస్కూల్లో విద్యార్థినులు కె దృతిశ్రీ,, సీహెచ్ హాసిని, కె లేఖ్యకు 2025 షైనింగ్ స్టార్స్‌కు సంబంధించిన జ్ఞాపిక, రూ.20వేల నగదు ప్రోత్సాహకాలను ఒకొక్కరికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అందజేశారన్నారు. విజేతలకు అభినందనలు తెలియజేశారు.

గుడ్లవల్లేరు విద్యార్థులకు స్టార్ అవార్డులు

గుడ్లవల్లేరు: పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఏస్ఆర్ హైస్కూల్ విద్యార్థులకు మచిలీపట్నం జెడ్పీ కన్వెన్షన్ హాల్లో సోమవారం షైనింగ్ స్టార్ అవార్డులను అందించారు. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి విలేకరులకు సోమవారం తెలిపారు. వత్తుమిల్లి తరుణ్, పామర్తి శివ నాగబాబు, పెనుమూడి జయశ్రీ, లిఖిత శ్రీ, సాల చరణ్ తేజకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధర్, డీఈఓ రామారావు అవార్డులు అందించారని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి



గుడ్లవల్లేరు: గుడివాడ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. టిడ్కో కాలనీ నుంచి కొతవరం వరకు నిర్మించిన 33 కే.వీ విద్యుత్ లైన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికై రూ.4 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు. రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ విద్యుత్ ఈఈ జి.బి.శ్రీనివాసరరావు, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, విద్యుత్ ఏడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- పుష్పపరిమళాలతో శోభిల్లిన వెంకన్న కోవెల
- కల్యాణాన్ని తిలకించేందుకు పోటెత్తిన భక్తజనం



ప్రత్యేక అలంకారంలో స్వామివార్ల మూలమూర్తులు

కోడూరు: వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాల నడుమ శ్రీనివాసుడి కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. ఆలయం ముందు భాగంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదిక వద్దకు స్వామివారిని రాజసింహాసనంపై, అమ్మవార్లను ప్రత్యేక పల్లకిలో ఊరేగించుకుంటూ తీసుకువచ్చారు. టీటీడీకి చెందిన వేదపండితుల మంత్రోచ్ఛరణలు నడుమ కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ ఉపన్యాసవాచస్పతి మొవ్వ వృషాద్రిపతి కల్యాణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పండితులు స్వామివారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ప్రత్యేక పాటను ఆలపించారు. స్వామివార్ల కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు, పండితులు

గరుడవాహనంపై ఊరేగింపు

సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో గరుడ వాహనంపై కల్యాణమూర్తులకు తీరువీధి ఉత్సవం జరిపారు. కోడూరు, కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లో ఊరేగింపునకు భక్తులు ఘనస్వాగతం పలికారు. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమావేశాలకు హాజరుకాని వారిపై ఫిర్యాదు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పమిడిముక్కల: మండల పరిషత్ సమావేశానికి హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ వీర్ల సీతారామరాజు తెలిపారు. మొత్తం 25 శాఖల అధికారులు సమావేశానికి రావాల్సి ఉండగా, కేవలం 10 శాఖల వారే హాజరయ్యారని పేర్కొన్నారు. గత మూడు సమావేశాలుగా గైర్హాజరువుతున్న అధికారుల జాబితా తయారు చేస్తామన్నారు. వీరికి నోటీస్ పంపి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ వేల్పూరులో అనుమతులు లేకుండా పంచాయితీ చెరువు తవ్వుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారని, పనులు నిలుపుదల చేయించానని తెలిపారు. ప్రజాప్రతినిధుల కోరిక మేరకు అన్ని శాఖల అధికారులతో మరో నెల రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు మాత్రమే అన్నదాత-సుఖీభవ వస్తుందని, కౌలుదారులకు ప్రస్తుతం వచ్చే అవకాశం లేదని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. ధాన్యం రవాణా చార్జీలు ఇంకా రాలేదని, ఎప్పుడిస్తారని ఎంపీటీసీ వీర్ల ఆదిశేషు ప్రశ్నించారు. తహసీల్దార్ సమావేశానికి రాకపోతే సమస్యలెలా పరిష్కారమవుతాయని నిలదీశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

సీడీపీఓ భానుశ్రీ



కనుమూరులో మాట్లాడుతున్న సీడీపీఓ భానుశ్రీ

కనుమూరు(పామర్రు): మూడేళ్లు నిండిన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీఓ వీ భానుశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కనుమూరులో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో చిన్నారులకు ఆసక్తికరంగా విద్యాబోధన జరుగుతుందన్నారు. కేంద్రాల్లో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పోషకాహారాలను తీసుకుని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పామర్రులో..

గ్రామంలోని కొబ్బరితోటలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సీడీపీఓ భానుశ్రీ, పెదమద్దాలి, పామర్రు సెక్టార్ సూపర్‌వైజర్లు విజయకుమారి, నూతక్కి సత్యశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని వీరంకిలాకు ఎన్‌టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగనవాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉష తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే స్రవంతి పాల్గొన్నారు. వీరంకి అంగన్‌వాడీ కేంద్రంలో అంగనవాడీ పిలుస్తోంది కార్యక్రమం జరిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత పాల్గొన్నారు.



వీరంకిలాకులో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం

ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలి



కైకలూరులో జరిగిన కొల్లేరు పెద్దల సమావేశంలో ఎమ్మెల్యేలు, నాయకులు

కైకలూరు: ప్రజలందరూ ఐక్యంగా ఉండి కొల్లేరు సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో కొల్లేరులో పరిస్థితులను అధ్యయనం చేయడానికి త్వరలో రానున్న కేంద్ర సాధికారత కమిటీ (సీఈసీ)కి విన్నవించే అంశాలపై కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర చేపల రైతుల సంఘం, కొల్లేరు ప్రజల ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో కొల్లేరు పెద్దలకు అవగాహన సమావేశం సోమవారం జరిగింది. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చేపల రైతు సంఘ అధ్యక్షుడు తాడినాడ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కొల్లేరు కాంటూరు కుదింపు కుదరదని కేంద్రం స్పష్టం చేసిందన్నారు. కొల్లేరులో పర్యావరణంతో పాటు ప్రజల మానవీయ కోణానికి తగ్గట్టు న్యాయం చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కొల్లేరు నీటిని బయటకు పంపించే ఉప్పుటేరు 230 మీటర్లుగాను ప్రస్తుతం 70 మీటర్లు మాత్రమే ఉందన్నారు. ఆక్రమణలను తొలగిస్తామన్నారు. సీఈసీ పర్యాటకు వచ్చినప్పుడు కొల్లేరు గ్రామాల్లో ప్రజల సమస్యలను అర్జీల రూపంలో అందించాలన్నారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో ప్రజల అభీష్టం మేరకు అభయారణ్య విస్తీర్ణాన్ని తగ్గించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠల్‌రావు, వడ్డీల సాధికారత కమిటీ చైర్మన్ బలే ఏసురాజు, కొల్లేరు కమిటీ సభ్యుడు సంబూరి శివాజీరాజు, కొల్లేరు సంఘ అధ్యక్షుడు సైదు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ వివరాలు వెల్లడిస్తున్న అధికారులు వాసు, కృష్ణానాయక్

ఘంటసాల: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వాసు, విద్యుత్ శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీ కృష్ణానాయక్ హెచ్చరించారు. ఘంటసాల మండలంలోని వ్యాపార, గృహ సముదాయాల విద్యుత్ వినియోగదారుల సర్వీసులను ఆ శాఖ అధికారులు 50 మంది 32 బృందాలుగా ఏర్పడి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు వాసు, కృష్ణానాయక్ మాట్లాడుతూ ఘంటసాల మండలంలో ఆరుగురు విద్యుత్ వినియోగదారులు కేటగిరి-1 పేరుతో కనెక్షన్ తీసుకుని ఇతర కేటగిరీలకు వాడుతున్నట్లు గుర్తించి వారికి రూ.9,400లు జరిమానా విధించారు. అలాగే 229 మంది విద్యుత్ వినియోగదారులు అనుమతించిన లోడు కంటే 309 కిలో ఓట్స్ అదనంగా విద్యుత్ వాడుతున్నట్లు గుర్తించి వారికి రూ.6.18 లక్షలు చొప్పున మొత్తం 235 మందికి రూ.6,27,400 జరిమానా విధించినట్లు వివరించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని తెలిపారు. విద్యుత్ చౌర్యం చేస్తే పూర్తి వివరాలతో 94408 12091, 94408 12363కు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. అలాగే పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడంతో పాటు మిగులు విద్యుత్ అమ్ముకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో చల్లపల్లి, అవనిగడ్డ డీఈఈలు పులి శివనాగేశ్వరరావు, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఘంటసాల ఏఈఈ పి.రవికుమార్, డివిజన్, ఇతర సెక్షన్లలోని ఏఈఈలు, జేఈఈలు, ఎల్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పలు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 10వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.బసవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ కంకిపాడు సచివాలయం, 10, 11 తేదీల్లో మద్దూరు సచివాలయం, 12, 13 తేదీల్లో ఈడుపుగల్లు సచివాలయంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరుగుతాయన్నారు. 0 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదు ప్రత్యేక డ్రైవ్‌ను వినియోగించుకోవాలని కోరారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి



గన్నవరం రూరల్: గ్రామాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులను నిర్ణీత కాలంలో తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆరోగ్య శాఖ ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. సోమవారం మండలంలోని కొత్తగూడెంలో ఉన్న తాగునీటి ట్యాంకులు, బోర్లు పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రవికాంత్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ట్యాంకులను కడిగిన తర్వాత తప్పక క్లోరినేషన్ చేయాలని, రిజిస్టర్లు నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఏ తేదీ ట్యాంకులు శుభ్రం చేయాలో ప్రదర్శించాలని తెలిపారు. గ్రామంలో పర్యటించి పైప్ లైన్ లీకేజీలు పరిశీలించారు.